

భయం గుప్పిట్లో ప్రజలు



- గ్రామాల్లో సంచరిస్తున్న పులి
- అడుగు జాడలను పరిశీలిస్తున్న అధికారులు
- నాలుగేళ్ల తర్వాత గిరిజన గూడాల్లోకి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

గోవింద్‌పూర్‌లో పులి అడుగులు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 7: కవ్వాల్ టైగర్‌జోన్ కోర్ ఏరియాలో ఉన్న జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గ ప్రాంతంలో పులులు సంచరిస్తున్నాయి. తడోబా అభయారణ్యం నుంచి పులులు ప్రాణహిత గుండా జిల్లాలో ప్రవేశిస్తున్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కేవలం వాంకిడి మండల పరిసర ప్రాంతాల్లో అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటుంది. ఆసిఫాబాద్, తిర్యాణి, రెబ్బెన, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాల్లో పులి సంచారం లేదు. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా గిరిజనులు అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం సోమవారం జిల్లా కేంద్రానికి సమీపంలో కనిపించిన పులి బుధవారం నాటికి పెద్దవాగు ద్వారా తిర్యాణి అటవీరేంజ్‌లోకి ప్రవేశించడంతోపాటు ఒక అవుపై దాడిచేసి చంపింది. దీంతో గిరిజన గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు.

భయం..భయంగా గ్రామస్థులు..

సోమవారం ఆసిఫాబాద్ పరిసరప్రాంతాల్లో కనిపించిన పులి మంగళవారం సాయంత్రం నాటికి వట్టివాగు సమీపంలోని ఎర్రగుట్ట వద్ద ఆవును చంపింది. పులి ప్రస్తుతం ఇదే ప్రాంతంలో తిరుగుతుండటంతో గిరిజన గ్రామాలు వణికిపోతున్నాయి. చేనులలో పెరిగిన గడ్డి తీయడంతో పాటు ముమ్మరంగా వ్యవసాయపనులు కొనసాగుతున్న నేపథ్యంలో అటవీ ప్రాంత సమీపంలోని చేన్లలోకి వెళ్లడానికి జంకుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని పాడిబండ గ్రామపంచాయతీలోని మందపల్లితో పాటు పలు గ్రామాలు, తిర్యాణి మండలంలోని తోయగూడ, ఆరెగూడ, గోవుర్‌గూడ, డోంగార్‌గాం, దేవాయిగూడ, పంగిడి, పంగిడిమాదర, బుగ్గగూడ, భీంజిగూడ, రెబ్బెన మండలంలోని చోపిడి, ఖైర్‌గూడ, గోలేటికి కూడా పులి ముంపు పొంచి ఉంది. అన్నీ గిరిజన గ్రామాలు కావడంతో పులి భయంతో వనికి పోతున్నారు.

పులి అడుగుజాడల పరిశీలనలో అధికారులు

ఆదివారం వరకు కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని అంకుసాపూర్ వద్ద ఉన్న పులి సోమవారం నాటికి జిల్లా కేంద్రానికి సమీపంలోకి రావడం, మంగళవారం నాటికి తిర్యాణి మండలం వైపు వెళ్లడంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం పులి అడుగులను గుర్తిస్తూ ఆయా గ్రామాలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. పులిని రక్షించడంతో పాటు ప్రజలకు హాని కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం ఎర్రగుట్ట వద్ద ఆవును చంపగా పులిని గుర్తించడానికి కెమెరాలు ఏర్పాటు చేశారు.

నాలుగేళ్ల తర్వాత గిరిజన గూడాల్లోకి..

2020మేలో జిల్లాకేంద్రానికి సమీపంలోని చిర్రకుంట ప్రధాన రహదారిపై పులి కనిపించడంతో వారంరోజుల పాటు ప్రజలు ఆ దారిలో నడవడానికి కూడా భయపడ్డారు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ పులి గిరిజన గూడల్లోకి అడుగుపెట్టింది. పులి మైదానప్రాంతంలో మాత్రమే తిరుగుతుంది. ప్రస్తుతం తిర్యాణి మండలం మొత్తం కొండలు, గుట్టలతో కూడుకొని ఉండటం, పులి సంచరించడానికి అనువైన ప్రదేశం కాకపోవడంతో తిరిగి వెళ్లిపోతుందని అధికారులు చెబుతున్నారు. 2020లో ఇలాగే ఐదు రోజులు తిరిగిన పులి వెళ్లిపోయింది. అదే ప్రస్తుతం పునరావృతం అవుతుందని చెబుతున్న మాటలు నిజం అవుతాయో లేదా వేచి చుడాలి.

పులి పయనమెటు?

ప్రస్తుతం జిల్లాలో తిరుగుతున్న పులి కొత్తగా వచ్చిందని ఇంకా దానిని గుర్తించి పేరు నిర్ణయించలేదని అధికారులు తెలుపుతున్నారు. అయితే సాధారణంగా పులి వేట కోసం సాయంత్రం ఐదు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు తిరుగుతూ ఉంటుందని చెబుతున్న అధికారులు ఈ సమయంలో 40 నుంచి 50కిలోమీటర్లు తిరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇలా తిరిగితే పులి ఎటువైపు వెళుతుంది అనేది చర్చగా మారింది. ఏదేమైనా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

తిర్యాణి మండలంలో సంచరిస్తోంది..



నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, జిల్లా అటవీశాఖ అధికారి

పులి ప్రస్తుతం తిర్యాణి మండలంలో సంచరిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు పులి సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులకు సహకరించాలి. అటవీ సిబ్బం దిని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. రాత్రిపూట ఆయా గ్రామాల ప్రజలు బయట తిరగకూడదు. ఎక్కడైనా పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

కేటాయించిన లక్ష్య సాధనకు కృషిచేయాలి

- వీసీలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్, ఆగస్టు 7: రైసు మిల్లులకు కేటాయించిన లక్ష్యాల సాధనకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అదనపుకలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో వానాకాలం, యాసంగి వడ్లు సీఎంఆర్ వడ్ల సేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. 2023-24సంవత్సరానికి సంబంధించిన వానాకాలం, యాసంగి సీఎంఆర్ ప్రక్రియను వెంటనే పూర్తిచేసి 2024-25 వానాకాలంలో వచ్చే ధాన్యం సేకరణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ దాసరి వేణు మాట్లాడుతూ 2023-24సంవత్సరం వానాకాలం, యాసంగిలో సేకరించిన వడ్లను బియ్యంగా మార్చేందుకు రైసుమిల్లులకు తరలించామన్నారు. రైసు మిల్లులకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం బియ్యాన్ని సేకరించేందుకు అన్నిచర్యలు చేపడుతున్నామన్నారు. 2024-25లో వానాకాలం సీజన్‌లో వడ్లను సేకరించేందుకు ముందస్తు ప్రణాళికలు పూపొందించుకొని ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ధాన్యం సేకరణప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలోజిల్లాలోనిపౌరసరఫరాశాఖ అధికారులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ పోస్టల్ సూరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ



మాట్లాడుతున్న దేవిరెడ్డి సిద్ధార్థ

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 7: తపాలా శాఖలో ఉన్న ఇన్సూరెన్స్ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ అన్నారు. బుధవారం స్థానిక తపాలా సబ్‌డివిజన్ కార్యాలయంలో సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యో గుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలోనే కాగజ్‌నగర్ సబ్‌డివిజన్ మొదటి స్థానంలో ఉందన్నారు. తపాలాశాఖలో ఉన్న బీమా, చిన్న మొత్తాల పొదుపులను అందరూ వినియోగించుకోవాలన్నారు. అతి తక్కువ ప్రీమియం కేవలం రూ. 549తో 10లక్షల బీమా పాలసీనీ పొందవచ్చునన్నారు. టాటా, నివా, స్టార్ హెల్త్, హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్, తదితర స్కీంల ద్వారా రూ.10నుంచి 15లక్షల రూపాలయ బీమా పొందవచ్చునన్నారు. అనుకోని సంఘటనల్లో ప్రమాదం జరిగితే కుటుంబసభ్యులకు ధీమాగా ఉండే ఇన్సూరెన్స్ పాలసీలతో ప్రయోజనం పొందాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సతీష్, సీనియర్ బ్రాంచి పోస్టుమాస్టర్ సంతోష్, మంచిర్యాల ఐబీపీబీ మేనేజర్ వెంకటస్వామి, సాగర్, కృష్ణ, గణేష్, సబ్‌పోస్టు మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ సదాశివ మాస్టారు వర్ధంతి



వర్ధంతిలో పాల్గొన్న సదస్సు సభ్యులు

కాగజ్‌నగర్, ఆగస్టు 7: పట్టణంలో బుధవారం డాక్టర్ సామల సదాశివ మాస్టారు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండు సమీపంలో ఉన్న సామల సదాశివ మాస్టారు విగ్రహానికి తెలుగుసాహితీసదస్సు సభ్యులు పూలమాలలువేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాహితీ రంగంలో సదాశివ మాస్టారుసేవలు చిరస్మణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లాసైన్స్ అధికారి మధుకర్, తెలంగాణ సాహితీ సదస్సు సభ్యుడు, కవి కిషన్‌శర్మ, మామిడాల తిరుపతయ్య, శ్యాంసుందర్, రాజేందర్,శ్రీనివాస్‌పాల్గొన్నారు.

విద్యార్థినుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్, ఆగస్టు 7: మండలంలోని భట్టుపల్లి-అందవెల్లి రోడ్డు పూర్తిగా బురదమయంతో ఉండటంతో నడవలేని పరిస్థితి దాపురించింది. వెంటనే రోడ్డును బాగుచేయాలని బుధవారం ఆ దారిగుండా వెళుతున్న విద్యార్థినులు బురదలోనే నిలబడిన నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామసమీపంలో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. కాలినడక వెళ్లాలన్నా కష్టంగాఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరారు.

ఆర్వోబీపై నుంచి రాకపోకలు

సిర్పూరు(టి), ఆగస్టు 7: సిర్పూరు(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై వేంపల్లి రైల్వేగేటు వద్ద ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై నుంచి ద్విచక్రవాహనాలు, కారులు, ఆటోలు, బస్సులు వెళుతున్నాయి. ప్రజలే స్వచ్ఛందం గా రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి వెళుతుండటంతో సమస్య తీరినట్లయింది. అత్యవసర సేవలకు క్లియరెన్స్ అవటంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యానవన అభివృద్ధికి చర్యలు: కలెక్టర్





ఆసిఫాబాద్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న కలెక్టర్,అదనపు కలెక్టర్. రెబ్బెనలో మొక్క నాటుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్, ఆగస్టు 7: జిల్లా కేంద్రంలోని ఉద్యానవన కేంద్రాన్ని బుధవారం ఉదయం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో యోగ, వాకింగ్, జిమ్ కోసం వచ్చిన వారు పార్కులోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాకింగ్‌ట్రాక్ బురదమయంగా ఉంటుందని, యోగ సాధన కోసం షెడ్డు నిర్మించాలని తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వాకింగ్ ట్రాక్‌పై క్రషర్ చిప్స్ వేయడానికి, యోగషెడ్డు నిర్మాణానికి, నీటి వసతి కల్పించాలని పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావును ఆదేశించారు. వారివెంట డీపీవో భిక్షపతిగౌడ్, డీఆర్‌వో లోకేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి..

రెబ్బెన: పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛదనం, పచ్చదనంకార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులు, మున్సిపాల్టీ సిబ్బంది నిర్వహించే ప్రతి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. అనంతరం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, వసతిగృహాలను సందర్శించారు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందించాలన్నారు. సింగరేణిఏరియా జీఎంతో మాట్లాడి వనమహోత్సవంపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లాపంచాయతీఅధికారి భిక్షపతి, సింగరేణి జీఎం రవి ప్రసాద్, తహసీల్దార్ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

బండరాళ్ల రోడ్డు.. బాలింత కష్టాలు



ఎండ్ల బండిపై వెళుతున్న బాలింత

కెరమెరి, ఆగస్టు 7: ఎండ్ల బండిపై కూర్చుని.. బండరాళ్ల రోడ్డుపై వెళుతూ బాలింత పడ్డ కష్టాలు అంతా ఇంత కావు. బుధవారం కెరమెరి మండలం పర్సవాడ గ్రామంలో ఈ హృదయ విదారక సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాథోడ్ కల్పన మంగళవారం పురిటి నొప్పులతో బాధపడగా బండరాళ్ల రోడ్డుపై కాలినడకన కెలి(బి) గ్రామానికి చేరుకుంది. అక్కడి నుంచి కెరమెరి పీహెచ్‌సీకి ఆటోలో వెళ్లింది. మంగళవారం రాత్రి కల్పన మగశిశువుకు జన్మనిచ్చింది. తిరుగు ప్రయాణంలో కెలి(బి) వరకు మళ్లీ ఆటోలో వచ్చిన నిండు బాలింత కెలి(బి) నుంచి పర్సవాడ గ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి ఎండ్ల బండిపైనే ప్రయాణం చేయాల్సి వచ్చింది. చుట్టూ ఎత్తైన గుట్టలు బండరాళ్ల దారి గుండా ఎండ్లబండిపై అతికష్టం మీద గ్రామానికి చేరుకోవాల్సి వచ్చింది. ఈక్రమంలో గుట్టఎక్కే సందర్భంలో ఎండ్ల బండి కూడా రాళ్లదారిపై ముందుకు వెళ్లలేకపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పర్సువాడగ్రామానికి రోడ్డునిర్మించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

డీఐఈవోకు ఘన సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 7: జిల్లాఇంటర్మీడియట్ విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన కాగజ్‌నగర్ ప్రిన్సిపాల్ కళ్యాణిని బుధవారం జీజేఎల్‌ఏ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్‌మీడియట్ విద్యావ్యవస్థ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. అనంతరం ఇక్కడ డీఐఈవోగా పనిచేసి మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళుతున్న నైతంశంకర్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలుపలికారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, జీజేఎల్‌ఏ ఆసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, మల్లశ్రీనివాస్, చంద్రయ్య, అమరేందర్ పాల్గొన్నారు.

ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడికి సన్మానం

ఆసిఫాబాద్, ఆగస్టు 7: ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన జిల్లాకు చెందిన పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా బార్ అసోసియోషన్ అధ్యక్షుడు రాపర్తి రవిని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దేవభూషణం ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రధానకార్యదర్శి తిరుపతి, రాజేంద్రప్రసాద్, సభ్యులు సంజీవ్‌కుమార్, జితేష్ పాల్గొన్నారు.

'ఎస్సీ డిక్లరేషన్‌కు నిధులు ఇవ్వాలి'

బెజ్జూరు, ఆగస్టు 7: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలని బుధవారం బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి డిప్యూటీతహసీల్దార్ బీమ్లానాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఅంబేద్కర్ అభయ హస్తం ద్వారా రూ.12లక్షల ఆర్థికసాయం అందించాలన్నారు. ఎస్సీ ఉపకులాలు మాల, మాదిగల సంక్షేమానికి ఏడాదికిరూ.750కోట్లు నిధులు విడుదలచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాడి దిగంబర్, తాళ్ల రామయ్య, లింగాల శంకరయ్య, గూడ రాకేష్, జాడి లక్ష్మణ్, బిబ్బెర మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్

కెరమెరి, ఆగస్టు 7: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్నామని డీఈవో అశోక్ అన్నారు. బుధవారం ఆయన ధనోరలోని ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పి డబ్బులు వృధా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో ప్రకాష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వాహన పన్నులు సకాలంలో చెల్లించాలి'

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 7: జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహన దారులు తమ వాహనాలకు సంబంధించిన వాహన పన్నులను సకాలంలో చెల్లించాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఎల్ రాంచందర్ పేర్కొన్నారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్, పర్మిట్, వాహనబీమా, పొల్యూషన్, లైసెన్స్ ఇతర ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కాగజ్‌నగర్, ఆగస్టు 7: సమస్యలను పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలల నుంచి జీతాలు చెల్లించటం లేదన్నారు. అలాగే పెండింగ్‌లోని ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు కార్పోరేషన్‌లకు కట్టడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులు

ఆసిఫాబాద్, ఆగస్టు 7: వివాహ శుభకార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. శ్రావణమాసం శుభమూహుర్తాలలో ఈనెల5నుంచి సెప్టెంబరు3 వరకు బస్సులను అద్దెకు తీసుకుంటే 10శాతం రాయితీ కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్‌నెం: 9640963321, 9440464035 లకు సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి: ఎమ్మెల్యే



ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 7: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న ఫుట్ ఓవర్‌బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, అరుణ్‌లోయా, ప్రయాగ్‌తివారి, రైల్వే చీఫ్‌కమర్షియల్ అధికారి కైలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత దినోత్సవం..: కాగజ్‌నగర్ చేనేత కేంద్రంలో బుధవారం చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. అలాగే చేనేతే కార్మికులు ఎమ్మెల్యే హరీష్‌బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజమౌళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు..: కాగజ్‌నగర్ నౌగాం బస్తీలోని మైసమ్మ ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. నూతనంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడారు. పలు సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా, అక్కడి నుంచే నేరుగా అధికారులకు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు.



'కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 7: కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యాలయంలో బుధవారం సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సింగరేణి ప్రాంతంలోని సులబ్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్‌కార్మికులు పలుసమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పదేళ్లుగా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. సులబ్ కాంప్లెక్స్‌లను శుభ్రం చేసేందుకు వాడే ఫినాయిల్, యాసిడ్, బ్లీచింగ్, తదితర రసాయనాలు వల్ల వారు తరచూ అనారోగ్యం పాలవుతుంటారన్నారు. ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని, ఇతర అనారోగ్యాల బారినపడి చనిపోయినవాతున్నారని తెలిపారు. సింగరేణి యాజమాన్యంగాని, సులబ్ ఇంటర్నేషనల్ సంస్థగాని వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. సింగరేణిలో ఇతర కాంట్రాక్ట్ కార్మికుల మాదిరిగా సీఎంపీఎఫ్, 8.33శాతం బోనస్, 30లక్షల రూపాయల ప్రమాదబీమా అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు మంతెన లక్ష్మయ్య, రాజేందర్, రాములు, కనుకయ్య, సమ్మయ్య, రాజు, వెంకటేష్, శంకర్, లక్ష్మి, జ్యోతి, విజయ, దివ్య, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగ పరీక్షలు ప్రశాంతం



హైదరాబాద్ కంట్రోల్ రూం నుంచి పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న సీఎండీ

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, ఆగస్టు 7: సింగరేణిలో 327ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల భర్తీకి మంగళ, బుధవారాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. వీటిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా సంస్థ సీఎండీ ఎన్ బలరాం పర్యవేక్షించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఉన్న 32పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, మొత్తం 29,291 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయిన్(ఎలక్ట్రికల్) పోస్టుకు 3491మంది, జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీపోస్టుకు 5001మంది, ఎలక్ట్రీషియన్ ట్రెయినీ పోస్టుకు 5539మంది, ఫిట్టర్‌పోస్టుకు 3666మంది, మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఈఅండ్ఎం) పోస్టుకు7965మంది, మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సిస్టమ్స్) పోస్టుకు 1708మంది, అసిస్టెంట్ ఫోర్‌మెన్(మెకానికల్) పోస్టుకు 1921మంది ఉన్నారు. 84శాతం హాజరు నమోదైంది. వారం రోజుల్లో ప్రాథమిక కీ విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గతనెల 20,21 తేదీల్లో 272ఎక్స్‌టర్నల్ పోస్టులకు, ఈ రెండు రోజుల్లో 327ఎక్స్‌టర్నల్ పోస్టులకు మొత్తం 599ఎక్స్‌టర్నల్ పోస్టులకు పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసినట్లు సీఎండీతెలిపారు. సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా మాయమాటలు చెప్తే నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. అలాంటి వారి సమాచారాన్ని సింగరేణి విజిలెన్స్, పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు.

'కాంట్రాక్ట్ ఉద్యోగుల హాజరు ఆన్‌లైన్ చేయాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 7: కాంట్రాక్ట్ ఉద్యోగుల హాజరు ఆన్‌లైన్‌చేయాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పర్సనల్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు చెందిన హాజరు, సీఎంపీఎఫ్, ఇన్సురెన్స్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా ఉద్యోగులకు అందిస్తున్న 30లక్షల ప్రమాదబీమా గురించి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్, ఆర్కే5, 6 గ్రూపు గనుల ఏజెంట్ ఏవీ రెడ్డి, ఆర్కే7, న్యూటెక్ గ్రూపు గనుల ఏజెంట్ రాముడు, డీజీఎంలు పి అరవిందరావు, ఆనంద్‌కుమార్, చంద్రలింగం, గనుల మేనేజర్లు, సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్టీపీపీ జీఎం

జైపూర్, ఆగస్టు 7: ఎస్టీపీపీ జీఎంగా ఎన్వీ రాజశేఖర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు జీఎంకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఎస్టీపీపీలో పనిచేసే ప్రతి అధికారి ప్లాంటు అభివృద్ధికి తమవంతు సహకారం అందించి దేశంలోనే అత్యుత్తమ ప్లాంట్‌లలో ఒకటిగా నిలపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు జెఎన్ సింగ్, శ్రీనివాసులు, ప్రసాద్, సుధాకర్, రమణ, మదన్‌మోహన్, సీఎంవోఏ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ప్రభాకర్, వెంకటయ్య, ఠాకూర్ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

ట్రస్మా పట్టణ కమిటీ ఎన్నిక

ఏసీసీ, ఆగస్టు 7: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ మంచిర్యాల పట్టణ కమిటీని జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రపాణి, సంయుక్త కార్యదర్శి మల్లేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడిగా జుల్ఫికర్, కార్యదర్శిగా కడారి కుమార స్వామి, కోశాధికారిగా బండారి మమత, గౌరవాధ్యక్షుడిగా రాజన్న, అడ్వైజర్‌గా జోబిన్, ఉపాధ్యక్షుడిగా తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

జైపూర్, ఆగస్టు 7: అప్పుల బాధ భరించలేక మేడ అశోక్‌రెడ్డి (38) అనే వ్యక్తి జైపూర్ అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో ఎస్ఐ నాగరాజు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలంలోని రెడ్డిపల్లి ధర్మారం గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో అప్పులు అధికం కావడంతో అప్పుల బాధ భరించలేక ఈ నెల 3న అటవీ ప్రాంతంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి వెళ్లి అశోక్‌రెడ్డిగా గుర్తించామన్నారు. భార్య జ్యోతి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోడు భూమిలో మామిడి చెట్లు నరికివేత

నెన్నెల, ఆగస్టు 7: మరో ఏడాదైతే కాపుకొచ్చే మామిడి తోటను ఫారెస్టు అధికారులు నిర్దాక్షిణ్యంగా నరికేశారు. ఓ నిరుపేద దళిత రైతు కుటుంబం నాలుగేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకున్న 150 చెట్లను రాత్రికిరాత్రే నేలకూల్చారు. ఉదయానికల్లా తోటలోని చెట్లన్నీ పడిపోయి ఉండడంతో రైతు కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ రైతు దంపతులు బుధవారం నెన్నెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతు జాడి మల్లేష్ చెప్పిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నార్వాయిపేట శివారులో మల్లేష్ మూడు ఎకరాల పోడు భూమిని 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. నాలుగేళ్ల కిందట 150 మామిడి మొక్కలు నాటుకొని వాటి సంరక్షణ కోసం ఇంటిల్లిపాది కష్టపడుతున్నారు. అదే తోటలో అంతరపంటలు పండించుకొని జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది అటవీ అధికారులు చేపట్టిన పోడుభూముల సర్వేలో సైతం ఎలాంటి అభ్యంతరాలు చెప్పక పోవడంతో ఇక ఆ భూమి తమకే దక్కుతుందను కు న్నారు. తీరా కాపునకు వస్తాయనుకుంటున్న మామిడి చెట్లను నరికివేశారని విలపిస్తూ చెప్పారు. బీట్ ఆఫీసర్ వెంకటేష్‌ను వివరణ కోరగా మల్లేష్ సాగు చేస్తున్న భూమి రిజర్వ్ ఫారెస్ట్‌లో కంపా ర్టిమెంట్ 356లో ఉందని చెప్పారు. ఇప్పటికే అతడిపై భూ ఆక్రమణ కేసు ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెట్లను తొలగించామని తెలిపారు.

'స్వచ్ఛదనం పచ్చదనం' విజయవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, ఆగస్టు 7: జిల్లాలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని రాజేశ్వర్‌రావుపల్లెలో బుధవారం మండల ప్రత్యేకాధికారి యాదయ్యతో కలిసి కలెక్టర్ పర్యటించారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రి వార్డులు, ఫార్మసీ, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో మల్లయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని 2వ వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు అఫ్జర్, ఉమాదేవి, నాయకులు శ్రీనివాస్, మధు, బానేష్, టీపీఓ చంద్రశేఖర్, మేనేజర్ చిట్టిబాబు, ఆర్ఐ ప్రవీణ్,శానిటరీ ఇన్‌స్పెక్టర్‌వైకుంఠం, ఇంజనీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. సారంగపల్లి గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో బుధవారం మట్టిని పోసి పూడ్చివేశారు. బొక్కలగుట్టలో ఎంపీడీవో రాజేశ్వర్ చెత్తను తీసివేయించారు. కార్యక్రమాల్లో ఏపీవో రజియా సుల్తానా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: కత్తెరసాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రం చేయిం చారు. నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అనంతరం గ్రామంలో జ్వరాల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి గంగాభవానీ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

కాసిపేట: స్వచ్ఛదనం పచ్చదనంలో అందరు భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి గంగారాం అన్నారు. బుధవారం మండలంలోని మామిడిగూడెం, చిన్న ధర్మారం, కాసిపేట, ముత్యంపల్లి, పల్లంగూడ,బుగ్గగూడెం గ్రామ పంచాయతీల్లో సిబ్బంది చేత పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

లక్షెట్టిపేటరూరల్: మండలంలోని చందారం, హన్మంతుపల్లి గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం పనులను బుధవారం ఎంపీడీవో సరోజ పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రాజన్న, పంచాయతీ కార్యదర్శి మౌనిక, శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



హాజీపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఎస్సీ కులాల వర్గీకరణ 341కి విరుద్ధం

జైపూర్, ఆగస్టు 7: ఎస్సీ, ఎస్టీ కులాలను వారి ఉపకు లాలను వర్గీకరి స్తూ గత గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధంగా ఉందని మాలమహానాడు చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేష్ అన్నారు. మండలం నుంచి బుధవారం మాల సంఘం నాయకులు ఢిల్లీకి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల తర్వాత సామాజిక వివక్ష కారణంగా ఏర్పడిన రిజర్వేషన్లను ఆర్థిక ప్రతిపాదిక ఎలా విడదీస్తారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల మధ్య గొడవలు పెడుతుందన్నారు. ఎస్టీ, ఎస్సీలు కలిసి ఉంటే అగ్రవర్ణాల రాజకీయం కనుమరుగు అవుతుందని మందకృష్ణ మాదిగను అడ్డం పెట్టుకుని దళితులను విడదీస్తున్నారని చెప్పారు. మందకృష్ణ వర్గీకరణ కోసం కాకుండా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కృషి చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో మధుకర్, రాజలింగు, ప్రవీణ్, శ్రీనివాస్, సత్యరాజ్, తిరుపతి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 8,9,10 తేదీల్లో ఢిల్లీలో చేపట్టిన మాలల సామాజిక దీక్షలకు బెల్లంపల్లి నుంచి మాలమహానాడు సంఘం నాయకులు బెల్లంపల్లి నుంచి రైలులో ఢిల్లీకి తరలి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజే ష్, నారాయణ, మధుకర్,మల్లన్న, రవికుమార్, తిరుపతి, రమేశ్, సురేందర్, దేవయ్య, సత్తయ్య, మల్లికార్జున్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మాల సంఘం నాయకులు

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

దండేపల్లి, ఆగస్టు 7: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్, మార్కెండేయ స్వామి మందిరంలో పద్మశాలి సంఘం నాయకులు జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా మార్కెండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డెపల్లి దేవయ్య, వోడ్నాల శంకర్, అలిశెటి లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని మంచిర్యాల జిల్లా పద్మశాలి సంఘం టీఆర్‌పీఎస్ అనుబంధ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ చేనేత కార్మికుడు అనుమాండ్ల సుదర్శన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్, గౌరవసలహాదారుడు గుండేటి యోగేశ్వర్, ఉపాధ్యక్షుడు చలమల్ల అంజయ్య, సంఘం నాయకులు వడ్డేపల్లి మనోహర్, అడిచర్ల రాజేశం పాల్గొన్నారు. కాగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్య క్షుడు గజెల్లి వెంకటయ్య బస్టాండ్, రైల్వే స్టేషన్ల ఆవరణలోని నిరాశ్రయులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు.

నస్పూర్: నస్పూర్ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. 2015 ఆగస్టు 7వ తేదీన చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ చేనేత లోగోను ఆవిష్కరించడంతో అప్పటి నుంచి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వేముల సురేష్, శ్రీ లక్ష్మి గణపతి శివ మార్కండేయ దుర్గాదేవి ఆలయం కమిటీ ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, నాయకులు కుసుమ శంకర్, రవీందర్, రామన్న, వెంకట్, రాజేష్, సాంబయ్య పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 7 : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. బుధవారం తాండూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, ఎంఈడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమిని, ఆగస్టు 7: తపాలా శాఖ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రతీ ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యవేక్షకులు సిద్ధార్థ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బుధవారం డాక్ చౌపాల్ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా గోడప్రతులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ముద్దు నాగేశ్వర్ రావు, పోస్టల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలి

కాసిపేట, ఆగస్టు 7: ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఆదివాసీ దినోత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మడావి వెంకటేష్ అన్నారు. కొండాపూర్ యాపవద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఆదివాసీలు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆదివాసీ అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. అన్నారు. ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినో త్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఆత్రం మహేష్, తిరుపతి, భూమన్న, ప్రభాకర్, శ్రీనివాస్, గంగారాం,శంకర్, రాధ తదితరులు పాల్గొన్నారు

ఆటో దొంగిలించిన ముగ్గురి అరెస్టు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 7: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ కాలనీలో ఆటో దొంగతనం చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆండాలమ్మ కాలనీకి చెందిన మహమ్మద్ నయీమ్ ఆటోను మంగళవారం రాత్రి తన ఇంటి ముందు నిలిపి ఉంచాడని చెప్పారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు లేచి చూసేసరికి రామకృష్ణాపూర్‌కు చెందిన మండల సుమన్, కుంటాల సంతోష్, ఎలుకపల్లి ఉమాదేవి ఆటోను దొంగిలించేందుకు యత్నించారని, తనను చూసి పారిపోయారని నయీమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఐబీ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ అనుమానాస్పదంగా కనిపించగా వారిని ఆటోకు సంబంధించిన పత్రాల గురించి అడుగగా చూపలేదని, దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆ ఆటో ఏసీసీ కాలనీలో గత నెల 18వ తేన దొంగిలించినదిగా గుర్తించామని తెలిపారు. ఈ ఆటోను హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. నిందితుల్లో సుమన్ అనే వ్యక్తిపై ఇప్పటికే రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు.

● బైక్ దొంగ అరెస్టు

పట్టణంలో 2 బైక్‌లను దొంగిలించిన గంగాధర్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. గంగాధర్ 15 రోజుల వ్యవధిలో రెండు బైక్‌లను దొంగిలించి ఓవర్ బ్రిడ్జి సమీపంలో దాచి ఉంచాడని, అందులో ఒక బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తికి అమ్మి మరో బైక్‌ను అమ్మేందుకు వెళ్తుండగా బుధవారం పట్టుకున్నామని సీఐ తెలిపారు.

ఇంటి నంబర్లు కేటాయించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 7: బెల్లంపల్లి మున్సిపాలిటీలో జీవో 76 ద్వారా ఇంటి పట్టాలు పొందిన ప్రతీ ఒక్కరికి ఇంటి నంబర్లు కేటాయించాలని బుధవారం కలెక్టర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజలింగు, రమేష్, అశోక్ గౌడ్, సురేష్ , రమేశ్, బానేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి'

ఆసిఫాబాద్, ఆగస్టు 7: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వసీహెచ్‌సీ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డుల పెండింగ్‌లోఉన్న మూడునెలల వేతనాలను వెంటనే చెల్లించాలని బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సిబ్బంది ఆసుపత్రి ఎదుట నిరసనచేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడునెలలుగా వేతనాలు రాకపోవడంతో జీవనం కష్టంగా మారిందన్నారు. వేతనాలు చెల్లించని కంట్రాక్టర్‌పై చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దివాకర్, శంకర్, చిరంజీవి, సిబ్బంది శ్రీశైలం, మల్లేష్, మురళీ, నీల, మమత, హరీష్, గంగన్న,గుణవంతరావు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన బార్ అసోసియేషన్ సభ్యులు

సిర్పూరు(టి), ఆగస్టు 7: ఆలేరు జనగాం సీఐ, ఎస్సైపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిర్పూరు(టి) న్యాయస్థానంలో బార్ అసోసియేషన్ సభ్యులు విధులను బహిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం ఫిర్యాదుదారుడి తరపున వెళ్లిన మహిళా న్యాయవాదుల దంపతులతో విధుల్లో ఉన్న సీఐ, ఎస్సైలు దురుసుగా, దుర్భాషలాడినట్టు తెలిపారు. సీఐ, ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిర్పూరు(టి) బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వజ్జల కిషోర్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు మహ్మద్‌రైస్ అహ్మద్, ఎంశంకర్ రావు, ఏజీపీ శ్రీనివాస్, న్యాయవాదులు గణపతి, గంట కళ్యాణ్, అహ్మద్, దయరాజ్‌సింగ్, సభ్యులున్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

ఆసిఫాబాద్, ఆగస్టు 7: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర పరిశీలకుడు శ్రీపాదరావు అన్నారు. స్వచ్ఛదనం- పచ్చ దనం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని బజారువాడి, ఫైకాజీనగర్, ఫిల్టర్‌బెడ్ ఏరియాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో పారిశుధ్యపనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుంతలలో నీరు నిలువఉండకుండా దోమలు వృద్ధిచెందకుండా దృష్టిసారించాలన్నారు. అనంతరం ఫిల్టర్‌బెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సిబ్బంది సంతోష్, రాజు, సారంగ పాణి, ఆనందం, భద్రయ్య, వంశీ, ఉదయ్, బాపురావు, శంకర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మానిక్‌గూడ, కొమ్ముగూడ గ్రామాలను ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించి పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై పలుసూచనలు, సలహాలుఇచ్చారు. ప్రత్యేకాధికారి కిరణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సిర్పూరు(టి): మండలకేంద్రంలో కోర్టుకు వెళ్లే రహదారిపై సిర్పూరు(టి) ప్రత్యేకఅధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో మురికి కాల్వలను శుభ్రం చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన

ఆసిఫాబాద్, ఆగస్టు 7: పట్టణంలోని గిరిజన ఆశ్రమోన్నతపాఠశాలలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో మహిళాచట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా షీటీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, హింస,సైబర్‌క్రైంలకు ఎవరైనాపాల్పడితే షీటీంలను 8712670564 సంప్రదించాలన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కెరమెరి, ఆగస్టు 7: మండలంలోని కొఠారి గ్రామంలో మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ముందస్తుసమా చారం మేరకు కొఠారిగ్రామం వద్ద లారీని తనిఖీ చేయగా ఇసుకకు సంబంధించిన అనుమతి పత్రాలు లేక పోవడంతో లారీని కెరమెరి పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు.

కొనసాగుతున్న గ్రంథపఠనం

వాంకిడి, ఆగస్టు 7: మండలకేంద్రంలోని జైతావన్ బుద్ధవిహార్‌లో బుద్ధ, ధమ్మ గ్రంథ పఠన కార్యక్రమం కొనసాగుతోంది. ఆషాఢ పౌర్ణమి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం నేటికి34వ రోజుకు చేరుకుంది. ప్రతిరోజురాత్రి 7నుంచి 8గంటలవరకు బుద్ధ, ధమ్మగ్రంథాన్ని ఉపాసకులు కుమార్, రాజేశ్వర్, విద్యాసాగర్ గ్రంథపఠనం చేస్తూ బుద్ధుడి మార్గదర్శనాలను ప్రతిఒక్కరూ ఆచరించేలా అవగాహన. కల్పిస్తున్నారు. దీంతోపాటు మండలంలోని ఖమానలోని బుద్ధవిహార్‌లోనూ గ్రంథపఠన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

అన్నాబావు సాఠె జయంతిని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

జైనూర్, ఆగస్టు7: జైనూరులో నిర్వహించనున్న కవిసామ్రాట్ అన్నాబావుసాఠె జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. అన్నాబావు సాఠె, అంబేద్కర్‌సంఘం కమిటీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు అన్నాబావుసాఠె జయంతికి అన్నివిధాలుగా సహకారాలు అందజేస్తామన్నారు. కార్య క్రమంలో అన్నాబావు సాఠె, అంబేద్కర్ సంఘం, మాంగ్‌సమాజం జిల్లా ప్రధాన కార్యదర్శి మవాలె దత్త, మవాలె భారత్, సముక్‌వార్ నర్సింగ్, పుల్లారె సోపాన్‌రావ్, పుల్లారె దుదానె కరణ్, భంగె లక్ష్మణ్, కోటంబె శ్రీహరి, పుల్లారె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

వాంకిడి: మండలానికి చెందిన మాసగోని సాగర్‌గౌడ్‌కు రూ. 60,000 ఇటన్‌కార్ పురుషోత్తంకు రూ.21000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా స్థోమతలేని నిరుపేదలకు వైద్యంకోసం ప్రభుత్వం అందజేస్తున్న సీఎంఆర్‌ఎఫ్‌నిధులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాంకిడి మాజీ సర్పంచు తుకారాం పాల్గొన్నారు.



వాంకిడి: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



రిషి హర్షిత్(ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 7: మండలంలోని గుండాల జలపాతంలో సోమవారం గల్లంతైన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రిషిహర్షిత్(18) మృతదేహం బుధవారం జలపాతం మడుగులో లభ్యమైంది. రెండురోజులపాటు గజ ఈతగాళ్లతో గాలించగా బుధవారం మృతదేహన్ని వెలికితీశారు. సంఘటనస్థలాన్ని డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై రమేష్ పరిశీలించి రిషిమృతదేహన్ని తిర్యాణి పీహెచ్‌సీకి తరలించారు. మృతుడు సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'రోడ్డు బాగుచేయకుంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం'

బెజ్జూరు, ఆగస్టు 7: మండలంలోని కొత్తగూడ-రెబ్బెన గ్రామాల మధ్య ఉన్న రోడ్డు బురదమయమై అధ్వాన్నంగా మారిందని వెంటనే బాగుచేయకుంటే ఎమ్మెల్యేఇంటిని ముట్టడిస్తామని బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు రాంటెంకినవీన్ అన్నారు. బుధవారం ఆయా గ్రామాల మధ్య రోడ్డును పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సొంత గ్రామంలోనే రోడ్లు ఇలాఉంటే ఎలాఅని ప్రశ్నించారు. అత్యవసర సమయాల్లో 108వాహనం కూడా రాలేనిస్థితి ఉండగా గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజూరు కాగా పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే చొరవతీసుకొని బాగు చేయించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సాగర్, విజయ్,పెంటయ్యసంపత్,చుక్కయ్యనితిన్‌ఉన్నారు.

రోడ్డును పరిశీలించిన డీఎల్పీవో

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పెంచికలపేట, ఆగస్టు 7: 'ఆంధ్రజ్యోతి' జిల్లాఎడిషన్‌లో బుధవారం ప్రచురితమైన 'దారి కష్టాలు దాటేదెప్పుడు' అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. బుధవారం డీఎల్పీవో ఉమర్‌హుస్సేన్ మురళీగూడ గ్రామాన్ని సందర్శించి రోడ్డును పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

ప్రతీ ఒక్కరికి బీమా అవసరం..

చింతలమానేపల్లి, ఆగస్టు 7: ప్రతీఒక్కరికి బీమాఅవసరమని తపాలా కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సతీష్ అన్నారు. మండలంలోని కర్జెల్లి గ్రామానికి చెందిన చౌదరి ఓంకార్ ఇటీవల రైలు ప్రమాదంలో కాలును కోల్పోవడంతో అంగవైకల్యం ఏర్పడింది. కాగా గతంలో ఓంకార్ తపాలాశాఖలో బీమా కోసం రూ.399చెల్లించడంతో బీమాకింద రూ.5లక్షలు, వైద్యఖర్చుల కోసం రూ.లక్షమొత్తం రూ.6లక్షలను బాధితుడు చౌదరి ఓంకార్‌కు తపాలా అధికారులు బుధవారం అందజేశారు. ఇలాంటి బీమా పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐపీపీబీమేనేజర్ వెంకట్, బీపీ ఎంలు మస్రూర్‌హుస్సేన్, పుల్లూరి సతీష్, చౌదరినానయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

జైనూర్, ఆగస్టు 7: మండలంలో మార్లవాయి బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీజీహెచ్ఎం యాసీఫ్ శరీఫ్‌ను బుధవారం మర్లావాయి ఆది వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైమన్ డార్ఫ్ సంఘం అధ్యక్షుడు కనక వెంకటేశ్వర్‌రావ్ మాట్లాడుతూ హెచ్ఎం యాసీఫ్‌శరీఫ్ పదోన్నతిపై హెచ్‌ఎంగా ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తున్నామని ఆయన పేర్కొ న్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, ఆత్రం హన్మంత్‌రావ్ పటేల్, దేవారి కనక గణపత్, సార్మేడి జుగునాక దేవరావ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

సిర్పూరు(టి): మండలకేంద్రంలోని అయ్యప్పఆలయానికి ఆసిఫాబాద్‌కుచెందిన భక్తులు అయ్యప్పస్వామి విగ్రహానికి 800గ్రాముల వెండికిరీటాన్ని అందజేశారు. కిరీటాన్ని అందజేసినభక్తులను ఆలయకమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

సిర్పూర్(యు): మండలంలోని మహగాం ఆశ్రమోన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా శ్రీనివాసచారి నియమితులయ్యారు. ఆయన మహబూబాద్ జిల్లా కొత్తగూడ ఆశ్ర మోన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ప్యానెల్‌గ్రేడ్ ప్రధానోపాధ్యాయుడిగా ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు.

కెరమెరి: ప్రతిఒక్కరూ ఇంకుడుగుంతను నిర్మించుకోవాలని జడ్పీడీప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలోభాగంగా బుధవారంసావర్‌ఖేడ, సూర్ధ పూర్ గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణానికి ముగ్గువేశారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రం నుంచి ఫోర్‌లైన్ హైవే రహదారిపైకి వాహనాలు రాంగ్‌రూట్‌లో వెలుతున్నాయన్న విషయం ఎస్పీ డీవీ శ్రీనివాస్ దృష్టికి వెళ్లడంతో స్థానిక సీఐసతీష్ పోలీసులను పహారాగా నియమించారు.

లింగాపూర్: స్థానికసంస్థలఎన్నికలు త్వరగా నిర్వహించాలని ఇటీవల ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో మండల వ్యాప్తంగా రాజకీయం వేడెక్కింది. ఎక్కడచూసినా సర్పంచ్ ఎన్నికలపైనేచర్చ. గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన గరిష్ఠంగా మూడునెలలకు మించి కొనసాగరాదని నిబంధన ఉంది. దీనితో స్థానికసంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

పెంచికల్‌పేట: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి అన్నారు. తల్లి పాలల్లో రోగనిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. దీంతో చిన్న పిల్లలకు ఎలాంటి వ్యాధులు దరికి రావాలన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలోని వైన్‌షాపు ముందు బుధవారం మండలానికి చెందిన చౌదరి పవన్, డోంగ్రె సదాశివ్‌లకు రూ.16వేలు దొరకడంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. డబ్బులు పోగొట్టుకున్నవారు స్టేషన్‌కువచ్చి కలవాలన్నారు.

బెజ్జూరు: మండలంలోని ఏటిగూడగ్రామానికి చెందిన మడే అన్నాజి బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా బీజేపీ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయాన్ని అందజేశారు.

-మండలకేంద్రంలో నిర్మిస్తున్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారంఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్,గౌరవాధ్యక్షుడుచంద్రశేఖర్, సభ్యులు సతీష్, మిర్యాలవెంకటరమణ, శ్యామల కిరణ్, శంకరయ్య, సంతోష్, నాగేష్, నేరెళ్ల సంతోష్ తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
గురువారం 8 ఆగస్టు 2024



డీటీసీపీ లేఅవుట్ అనుమతి పొందిన తర్వాతే రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి ప్లాట్లు అమ్ముకోవాలి. కానీ మంచిర్యాల జిల్లాలో ఈ నిబంధనలు పాటించకుండానే కొందరు అడ్డగోలుగా రియల్ వ్యాపారం కొనసాగిస్తూ ప్రజలను ముంచుతున్నారు. అనధికారికంగా వెంచర్లు వేసి కొనుగోలుదారులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.



అడ్డగోలు వ్యాపారం

- డీటీసీపీ పేరుతో రియల్టర్ల అక్రమాలు
- లే అవుట్ అనుమతులున్నాయంటూ ప్రచారం
- అనధికారికంగా వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయం
- సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తూ ఆకట్టుకునే యత్నం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మంచిర్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న స్థిరాస్తి వ్యాపారులు అడ్డదారుల్లో వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. డీటీసీపీ (డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) పర్మిషన్లు ఉన్నాయని అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. భారీ కటౌట్లు, జెండాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తూ వింత ప్రచారాలతో ప్లాట్లు విక్రయిస్తూ ప్రజలను నిట్ట నిలువునా ముంచుతున్నారు. లేఅవుట్ అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే స్థానిక సంస్థల నుంచి ఇంటి నిర్మాణానికి అనుమతులు రాకపోవడంతో పాటు అవసరమైన పక్షంలో బ్యాంకు రుణాలు కూడా పొందలేని పరిస్థితులు ఉంటాయి. ఇవి తెలియని కొనుగోలుదారులు లక్షలు వెచ్చించి నష్టపోతున్నారు. ఈ తతంగమంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

పదుల సంఖ్యలో అక్రమ వెంచర్లు..

జిల్లాలో చిన్నా చితక వెంచర్లు పక్కన బెడితే, ఎలాంటి అనుమతుల్లేని భారీ వెంచర్లు సైతం పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట, హాజీపూర్, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి లాంటి పట్టణాలు, పరిసర ప్రాంతాల్లో ఇటీవల అక్రమ వెంచర్లు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల్లో పెద్ద మొత్తంలో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం. హాజీపూర్ మండలంలోని దొనబండ సమీపంలో డీటీసీపీ అనుమతుల పేరుతో బడా కంపెనీకి చెందిన ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. అందులో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించక ముందే ప్లాట్లు విక్రయానికి పెట్టారు. లక్షెట్టిపేట మండలంలోని శాంతాపూర్ (అంకతిపల్లి) గ్రామంలో 30 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీ వెంచర్ ఏర్పాటు చేశారు. మధుర టౌన్‌షిప్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు అమ్మకానికి పెట్టారు. జాతీయ రహదారి నుంచి సుమారు 150 మీటర్ల దూరంలోని వెంచర్ వరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. మెయిన్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులో డీటీసీపీ అప్రూవల్ అని పేర్కొన్నారు. వాస్తవానికి మధుర టౌన్ షిప్ వెంచర్‌కు డీటీసీపీ అనుమతులు లేవని అధికారులే చెబుతున్నారు. కాగా బహిరంగా భారీ కటౌట్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తున్నా పట్టించుకు నేవారు లేరు.


వెంచర్ వరకు నిర్మించిన తారు రోడ్డు



డీటీసీపీ అప్రూవల్ ఉందని ఏర్పాటు చేసిన బోర్డు

ఏజెంట్లకు భారీ ప్యాకేజీలు..

లేఅవుట్ అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వ్యాపారులు ప్లాట్లు విక్రయించే ఏజెంట్లకు మాత్రం భారీ ప్యాకేజీలు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. అనుమతులు లేనందున వినియోగ దారులు ముందుకు రారని తెలిసిన వ్యాపారులు ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. వారికి టార్గెట్లు విధిస్తూ అక్రమంగా ప్లాట్లు విక్రయిస్తున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రతి ఆదివారం వెంచర్లలో పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేస్తున్నారని చెబుతున్నారు. టార్గెట్లు చేరుకున్న ఏజెంట్లకు టూర్ ప్యాకేజీలు కూడా ఇస్తుండడం గమనార్హం. లక్షెట్టిపేట రోడ్డులోని ఓ భారీ వెంచర్ నిర్వాహకులు లక్షలు వెచ్చించి తమ ఏజెంట్లు 40 మం దిని ఇటీవల బ్యాంకాక్ టూర్‌కు తీసుకెళ్లారు. అలా విందు, వినోదాలతో ఏజెంట్లను బుట్టలో వేసుకుంటున్న వ్యాపారులు అక్రమ పద్ధతుల్లో కోట్లకు పడగలెత్తుతూ ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండి కొడుతున్నారు. వ్యాపారులకు సంబంధిత అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.

నాన్ లే అవుట్ స్థలాలకు..

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసే వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసే వినియోగదారులు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదు. ప్రభుత్వం త్వరలో తీసుకొచ్చే లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం ప్రకారం కొనుగోలు చేసే స్థలం నాన్ లే అవుట్ గనుక రిజిస్ట్రేషన్ సమయంలో చార్జీలకు అదనంగా ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్ చార్జీలకింద ప్లాటు మార్కెటు విలువపై 14 శాతం పన్ను విధిస్తారు. అది వినియోగదారుడే భరించాల్సి ఉంటుంది. కాగా అనధికార వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాటును ఆనుకొని ఉన్న రోడ్డు కనీసం 30 ఫీట్ల వెడల్పు ఉండాలి. రోడ్డు తక్కువగా ఉన్న పక్షంలో సదరు ప్లాటు నుంచే రోడ్డుకు సరిపడా స్థలం మినహాయించి, మిగిలిన భూమికే ఎల్‌ఆర్‌ఎస్ వర్తింపజేస్తారు. అంటే రోడ్డుకు పోను మిగిలిన స్థలం మాత్రమే భూమి యజమానికి దక్కుతుందన్న మాట. లేఅవుట్ అనుమతులు ఉన్న వెంచర్లకు సంబంధించి నిబంధనలు, ఖర్చులు యజమానులే భరిస్తారు. దీంతో వినియోగదారుడిపై అదనపు భారం పడే అవకాశం ఉండదు.

నిబంధనలు ఇవీ..

లేఅవుట్ అనుమతులతో ఏర్పాటు చేయదలచిన వెంచర్లతో ఆయా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల పేరిట స్థలం అప్పగించాలి. మొత్తం విస్తీర్ణంలో 10 శాతం స్థలాన్ని స్థానిక సంస్థల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలి. అనుమతుల కోసం నిబంధనల మేరకు ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. అలాగే వెంచర్లలో ప్రజల సౌకర్యార్థం తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, వీధిలైట్లు, రోడ్లు, చెట్ల పెంపకం, పాఠశాల సౌకర్యం, గుళ్లు వెంచర్ యజమానులే సొంత ఖర్చులతో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ సౌకర్యాల కోసం స్థానిక సంస్థల పేరిట మరో 15 శాతం భూమిని తాకట్టు పెట్టాలి. పైన పేర్కొన్న సౌకర్యాలు పూర్తయిన తరువాత, సంబంధిత అధికారులు ధ్రువీకరిస్తే సదరు 15 శాతం స్థలం తిరిగి యజమానుల పేరిట మారుతుంది. నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు ఏజెంట్లను ఆశ్రయిస్తూ అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు.

పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 7: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని జాఫర్ నగర్‌లో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేయస్కరమైనవన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలని, దీంతో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి సంక్షేమాధికారి స్వరూప రాణి, డాక్టర్ అనిత, సీడీపీవో విజయలక్ష్మి, రజిత, శ్యామల పాల్గొన్నారు.

దండేపల్లి: తల్లిపాలు పిల్లలకు శ్రేష్టమైనవని వాటిని పుట్టినవెంటనే బిడ్డకు పట్టించాలని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. తల్లిపాల వారోత్సవలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దండేపల్లి మండలం గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గోపతి శైలాజ, గోవర్ధన రమ, దుమ్మ స్వప్న, వసంత, స్థానిక పాఠశాల హెచ్‌ఎం కమలాకర్, ఏఎన్‌ఎం విజయ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

హాజీపూర్: తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని మంచిర్యాలకు చెందిన వైద్యురాలు స్వరూపరాణి అన్నారు. మండలంలోని కర్ణమామిడిలోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం లయన్స్‌క్లబ్ మంచిర్యాల, లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లి సంయుక్తంగా నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు, క్యాన్సర్ వ్యాధి అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం ప్రోగ్రాం చైర్ ఎర్సన్ లయన్ మధుసూదన్‌రావు సహకారంతో సమకూర్చిన తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యత కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బాల మోహన్, డాక్టర్ రాకేష్‌రెడ్డి, సభ్యులు సుగుణాకర్‌రెడ్డి, నాగేందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, ప్రిన్సిపాల్ స్వప్న, ఏఎన్‌ఎం మమత, మీనాకుమారి పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం


మందమర్రిలో నిరసన తెలియజేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 7: ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని టీడీపీ పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్ తెలిపారు. బుధవారం స్థానిక రాష్ట్రీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఊసే లేదన్నారు. నాణ్యమైన విద్యుత్ ఇస్తామని చెప్పి కరెంటు కోతలు విధిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం చేసినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి ఎండీ షరీఫా, పట్టణ మహిళ అధ్యక్షురాలు జయ, ప్రధాన కార్యదర్శి సంధ్య, ఉపాధ్యక్షులు తిరుపతి, స్వామి, సుగుణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల అరెస్టు

జన్నారం, ఆగస్టు 7: తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్, జన్నారం తది తర ప్రాంతల్లో బైక్‌లు దొంగతనం చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. జన్నారం పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీసీపీ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన ముటపెల్లి అరుణ్ అదే జిల్లాకు చెందిన మెట్‌పల్లి మండంలంకు చెందిన బొడ్డు అరుణ్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం గాంధీనగర్‌కు చెందిన కోట వినయ్, కామనపల్లి గ్రామానికి చెందిన వేముల ప్రవీణ్‌లు కొన్ని రోజులుగా బైక్‌లను దొంగతనం చేస్తున్నారు. ఈ నలుగురు హైదరాబాద్‌లో 9, నిజామాబాద్‌లో 3, ఆర్మూల్‌లో 2, జన్నారంలో 1 మొత్తం 15 బైక్‌లను దొంగతనం చేశారన్నా రు. తమకు అందిన ఫిర్యాదు మేరకు లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ రాజవర్ధన్‌ఆధ్వర్యంలో నిందితులను పట్టుకుని సుమారు రూ. 25 లక్షల విలువ గల 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐ రాజవర్ధన్, హెడ్ కానిస్టేబుళ్లు తుకారాం, గౌస్, కానిస్టేబుళ్లు భాస్కర్, సురేష్, వెంకటేష్, రవీందర్‌లను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● దండేపల్లి: దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారా యణస్వామి ఆలయంలో భక్తులు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో శ్రావణ పూ జలు నిర్వహించారు.

- దండేపల్లి: గూడెం, వెల్గనూర్, ద్వారక , గుడిరేవు ప్రభు త్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వెరబెల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రఘునాథ్ వెరబెల్లి బ్యాగులు, నోట్ బుక్‌లను అందజేశారు.

- పెద్దపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యా ప్రవేశ్ కార్యక్రమ జాతీయ పరిశీలకులు ఎన్ శ్రీనివాస్, కల్పన సందర్శించి, బోధన తీరు, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు.

● మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించే సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు.

● నస్పూర్: స్వచ్ఛదనం-ప చ్ఛదనం కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగించి శుభ్రం చేశారు.

● మంచిర్యాల అర్బన్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అందరు కృషి చేయాలని దిశా సీపీఎం నీలమ్ అన్నారు. యూత్ ఫెస్టివల్‌లో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ మైదానంలో 2కే రన్‌ను నిర్వహించారు.

- మంచిర్యాల జిల్లా ఇంటర్మీ డియేట్ విద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె అంజయ్యను జిల్లా ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం, అధ్యాపకుల సంఘం నేతలు సన్మానించారు.

● ఏసీసీ: జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడికి నిరసనగా గురు, శుక్రవారాల్లో కోర్టు విధులను బహిష్కరించనున్నట్లు మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ తెలిపారు.

- మంచిర్యాల పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్న త పాఠశాల కాంపౌండ్‌ను ఆనుకుని రేకులతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్లను మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు.

● లక్షెట్టిపేటరూరల్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్‌చార్జి జడ్జిగా పనిచేసిన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెగ్యులర్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీప్, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

● జన్నారం, మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ నివారణపై ఫారెస్టు సెక్షన్ అధికారి రవికుమార్ అవగాహన కల్పించారు.

● వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీలోని కొత్తగూడెం నుంచి నీల్వాయి బ్రిడ్జి వరకు రోడ్డు మొత్తం గుంతలు పడి నీరు నిలిచిపోగా బీజేపీ నాయకులు రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు.

● కన్నెపల్లి: మండల కేంద్రంలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు.

● నెన్నెల: పదవీ విరమణ పొందిన మైలారం-1 అంగ న్‌వాడీ కార్యకర్త సురేఖకు బుధవారం గ్రామస్థులు, మం డల అంగన్‌వాడీ ఉద్యోగులు సన్మానించారు

● రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా ఇంజనీర్ జోస్యుల నాగరాజు గారు పదోన్నతిపై ఆప్మేల్ ఎండీగా విజయవాడ ప్రమోషన్‌పై వెళుతున్నందున ఆర్కేపీ సీఎస్పీ కార్మికులు, అధికారులు సత్కరించారు.

● కోటపల్లి: రాంపూర్‌లో వైద్య శాఖ ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు.

● మందమర్రిరూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే ఏకరూప దుస్తులు త్వరగా సిద్ధం చేయాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండ లంలోని కుట్టు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు.

● చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వంద మీటర్ల సమీపంలో ఉన్న దుకాణాలు, పాన్‌షాపుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

● మందమర్రిటౌన్: పట్టణంలోని 8వ వార్డు ప్రశాంతినగర్‌లో ప్రజాసేవ స్వచ్ఛంద సభ్యులు ఇంటింటికి వెళ్లి మొక్కలను పంపిణీ చేశారు.

ప్రతి రోజు పారిశుధ్య పనులు చేపట్టాలి

జైపూర్, ఆగస్టు 7: ప్రతి రోజు పారిశుధ్య పనులను చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండ లంలోని ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ముదిగుంటలో సెగ్రిగేషన్‌షెడ్డును పరిశీలించి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మల్టీ పర్పస్ వర్కర్లతో ఇంటింటికి చెత్త సేకరణ చేయించాలన్నారు. రోడ్లపై ప్లాస్టిక్ పడేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, కార్యదర్శులు సురేష్, సురేందర్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 7: సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో హరీష్ రాజ్ అన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఆరోగ్య ప్రాథమిక కేంద్రాలు, ఉప కేంద్రాలు, ఇతర ఆసుపత్రుల వైద్యులు , సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాలన్నారు. వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు జ్వరంతో కూడిన రోగులు ఆసుపత్రులకు ఎక్కువగా వస్తున్నందున వారికి మందులను అందజేయాలన్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటివి రాకుండా మున్సిపల్, పంచాయతీ సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని రకాల మందులను ఆరోగ్య కేంద్రాల్లో నిల్వ ఉంచుకోవాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల వివరాలను రోజువారీగా అందజేయాలని, డెంగీ జ్వరాలని భయపెట్టవద్దని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కిట్ల ద్వారా గుర్తించి పాజిటివ్ వచ్చిన కేసులకు జిల్లా ఆసుపత్రిలో గాని టీ హబ్‌లో కానీ ఎలీషా పరీక్ష ద్వారా గుర్తించిన తర్వాతనే డెంగీ అని నిర్ధారణ చేయాలన్నారు. జిల్లాలోజరిగిన బదిలీల్లో ఖాళీ అయిన స్థానాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే జిల్లాలో వంద శాతం సిజేరియన్‌కాన్పులు చేసిన ఆసుపత్రులను గుర్తించి నోటీసులు ఇచ్చామని చెప్పారు. జిల్లాలో వంద శాతం టీకాలు ఇప్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై రోజువారీ నివేదికలను అందజేయాలని సూచించారు. సమావేశంలో ప్రసాద్, సీతారామారాజు అనిత, అనిల్, ఫయాజ్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉంచుకోవాలి

జైపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని మందులను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ అన్నారు. కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ప్రతి రోజు ఎంత మంది ఆసుపత్రికి వస్తున్నారని డాక్టర్ శ్రావ్యను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి రోజు డ్రైడే జరపాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి అనిల్‌కుమార్, డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డాక్టర్ అనిత తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 7: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, ప్రభుత్వం ఆదుకోవాలని మందమర్రి ఆటో యూనియన్ అధ్యక్షుడు మొయ్య రాంబాబు, ప్రధాన కార్యదర్శి దుర్గం రవి, ఉపాధ్యక్షుడు రాజేష్‌యాదవ్‌లు తెలిపారు. బుధవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ప్రభుత్వం తమకు చేయూతనివ్వాలని కోరారు. అనంతరం ఆటో యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెం ట్‌గా రాంశేఖర్, ముఖ్య సలహాదారుడిగా చొప్పరి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా పంబాల శ్రీనివాస్, కోశాధికారిగా సముద్రాల శ్రీనివాస్,దాసరి రాజ్ కుమార్, ప్రచార కార్యదర్శులుగా ఆకుల శ్రీనివాస్,రవి, శంకర్, రాజు, రవి, పది మంది కార్య వర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కూలిన బ్రిడ్జి.. రాకపోకలకు గ్రామస్థుల అవస్థలు


పెద్దవాగు దాటుతున్న గ్రామస్థులు

మందమర్రిరూరల్, ఆగస్టు 7: మండలంలోని అందుగులపేట గ్రామ శివారులోని పెద వాగుపై గతంలో నిర్మించిన బ్రిడ్జి కూలిపోవడంతో రాకపోకలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలి కంగా వాగులో నిర్మించిన తాత్కాలిక వంతెనపై నుంచి ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థులల పొలాలన్నీ వాగు అవతలి వైపు ఉండడంతో తప్పనిసరిగా దాటాల్సి వస్తుండడంతో రైతులు , ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 7: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితీ నాయకులు నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న 36 పార్టీల్లో 32 పార్టీలు బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్నాయని వివరిచారు. 9 రాష్ట్రాల్లోని అసెంబ్లీలలో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని తీర్మానాలు చేసి కేంద్రానికి పంపినా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, భీమ్‌సేన్, రాజేశం, కిరణ్, అంకం సతీష్, కీర్తి భిక్షపతి, గోలివాడ వంశీ, కుమార్, బండ సతీష్, చంద్రగిరి చంద్రమౌళి, రామగిరి రాజన్న చారి, రాజు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

- తహసీల్దార్‌కు బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుల వినతి


నస్పూర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్, ఆగస్టు 7: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవేళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ వసతి గృహాల పునఃనిర్మాణం తదితర అంశాలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఎస్సీలను అదుకోవాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా, బీజేవైఎం, బీజేపీ నాయకులు రాజు, మొగిలి, రవనవేన శ్రీనివాస్, బద్రి శ్రీకాంత్, మహేందర్, శేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ అమలుచేయాలని కోరుతూ బుధవారం మండల బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు తహసీల్దార్ భోజన్నకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేవెళ్ల సభలో ఎస్సీ డిక్లరేషన్ ప్రకటించించి ఎస్సీలకు రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అమలు చేస్తామని ప్రకటించారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినందున వెంటనే ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని . సబ్సిడీ రుణాలు అందజేయాలని, సంవత్సరానికి వంద కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్, నాయకులు నర్సింగ్, నవీన్, ప్రసన్న , బాలాజీ, సంతోష్, శంకర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లేరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శైలెందర్‌సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం నెన్నెల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కోట వంశీ, ఎస్సీ మోర్చ కార్య వర్గ సభ్యులు కోట సమ్మయ్య, మండల నాయకులు కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

